
ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

గడువు ఇలా..

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌లకు సంబంధించిన పనులు ఆరు మాసాల్లోగా పూర్తి చేయాలి.
- ఏఐఎస్ కార్యదర్శులకు సంబంధించి 90 బంగ్లాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు 25 బంగ్లాలు, మంత్రులకు 35, హైకోర్టు జడ్జిలకు 36 బంగ్లాలను నిర్మిస్తున్నారు. ఈ పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేసి అప్పగించాలి.



పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

టెండర్లు పూర్తి.. మొదలైన పనులు

- పెండింగ్ పనులకు రూ.1112.74 కోట్లు
- రాజధానిలో రంగంలోకి దిగిన కాంట్రాక్టు సంస్థలు
- 4043 ప్రభుత్వ నివాసాల పూర్తికి గడువు నిర్దేశం

వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని పాడుపెట్టగా కూటమి ప్రభుత్వం తిరిగి గతంలో నిలిచిపోయిన పనులను పట్టాలెక్కిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ భవనాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. గతంలో చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకుని వైసీపీ హయాంలో పాడుబడిన భవనాలను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిశీలించి వాటిపై దృష్టి సారించాలని సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా పనులను పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ ఇటీవల టెండర్లు నిర్వహించింది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థలు రాయపూడికి చేరువగా ఈ-3, ఈ-4 రోడ్ల మధ్య 59.46 ఎకరాల్లో ఏఐఎస్, పిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, న్యాయమూర్తులకు చెందిన నివాస భవన నిర్మాణాలను చేపట్టాయి. 2019 నుంచి పాడుపడిన భవనాల సముదాయంలో పెద్ద ఎత్తున కమ్మేసిన ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేశాయి. అసంపూర్తి భవనాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఏమేమి పనులు చేపట్టాలన్న దానిపై ఆయా కాంట్రాక్టు సంస్థల ఇంజనీర్లు కసరత్తులు చేస్తున్నారు. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఏడాది గడువు విధించింది. దీంతో ఆయా పనులు శర వేగంగా చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రభుత్వ సెక్టారులో తొలివిడతగా 4043 నివాసాల పూర్తికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో వీటి నిర్మాణ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. ఇవన్నీ గత 2019 నాటికి మొదలు పెట్టి చాలా వరకు పూర్తయినవే. అయితే వైసీపీ ప్రభుత్వ షణ్ముమా అంటూ అవన్నీ గత ఐదేళ్లుగా పాడుపడి ఉన్నాయి. ఇపుడీ భవన సముదాయాలన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఆలిండియా సర్వీసెస్ కార్యదర్శుల బంగ్లాలు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్లు ప్రధానంగా ఉన్నాయి. ఈ భవన

(మిగతా 6వ పేజీలో)

నిధులు ఇలా..

ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్లు కేటాయించారు. వీటికి సంబంధించి తాజాగా టెండర్లను పిలవగా కేఎంవీ సంస్థ దక్కించుకుంది. ఏఐఎస్ బంగ్లా ఒక్కోటి నాలుగు వేల చ.అడుగుల విస్తీర్ణంలో, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలు ఐదు వేల చదరపు అడుగుల్లో ఏర్పాటవుతున్నాయి. మంత్రులు, న్యాయమూర్తుల కోసం 26.09 ఎకరాల్లో 71 బంగ్లాల నిర్మాణ పనులను బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ రూ.401.37 కోట్లతో చేపట్టింది. ఇవి ఆరు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+1 విల్లాల రూపంలోనే ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం రాయపూడి ప్రాంతంలోనే సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి పన్నెండేసి అంతస్తులతో కూడిన 18 టవర్ల(432 ఫ్లాట్‌లు)ను గతంలో రూ.450 కోట్లతో నిర్మించారు. ఇవన్నీ దాదాపు సివిల్ వర్కులను పూర్తి చేసుకున్నాయి. వీటిలో ఇంటీరియర్ వర్కులు, ఇతర మౌలికవసతులను కల్పించాల్సి ఉంది. ఆయా పనులకు రూ.300 కోట్లను కేటాయించి ప్రభుత్వం టెండర్ నిర్వహించగా ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది.



భవన సముదాయాల మధ్య ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

అనుసంధానంపై.. అధ్యయనం



మాట్లాడుతున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు

- బనకచర్లకు గోదావరి జలాల తరలింపు
- వరికపూడిశెల పనులు త్వరలో ప్రారంభిస్తాం
- పర్యాటక కేంద్రాలుగా అమరావతి, నాగార్జున కొండ అభివృద్ధి
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- జిల్లా అవసరాలపై నివేదిక సమర్పించిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'గోదావరి పెన్నా నదుల అనుసంధానంపై అధ్యయనం జరుగుతోంది. పోలవరం నుంచి బనకచర్లకు గోదావరి జలాల తరలింపుపై డిజైన్ రూపొందిస్తున్నాం. గోదావరి జలాలు సాగర్ కుడి కాల్వకు తరలించే అంశంపై కూడా అధ్యయనం చేస్తున్నాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా అవసరాలను తెలియజేస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు నివేదిక సమర్పించారు. దీనిపై సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. వరికపూడిశెల ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. అమరావతిలోని ధ్యాన బుద్ధ విగ్రహ అభివృద్ధిని పర్యాటక రంగ అభివృద్ధిలో చేర్చాలని అధికారులకు సూచించారు. అమరావతి, నాగార్జున కొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అన్న క్యాంటిన్ల ఏర్పాటుపై జాబితా ఇస్తే పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చారు. తొమ్మిది నెలల్లో గ్రోత్ రేట్‌పై అధికారులు సవాల్‌గా స్వీకరించాలని ఆదేశించారు.

24వ స్థానంలో జిల్లా

పల్నాడు జిల్లా 7.54 గ్రోత్ రేటుతో రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచింది. జిల్లా తలసరి ఆదాయం 1,86,937 నుంచి రూ.2,16,504 పెరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. లక్ష్యాల మేర గ్రోత్ పెరిగే దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నాలుగేళ్లలో 5.43 లక్షలకు తలసరి ఆదాయం పెరగాలని, ఈ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లా తలసరి ఆదాయాన్ని రూ.2,16,504కు పెంచే విధంగా రూపొందించిన ప్రణాళికను కలెక్టర్ సదస్సులో వివరించారు. జిల్లా వార్షిక ఆదాయ వృద్ధి 15.82 శాతం పెంచనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఉద్యాన పంటల ద్వారానే అధిక ఆదాయం వస్తుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీవీఏ రూ.49,105 కోట్లుగా, జీడీడీపీని రూ.53,488కు పెంచేలా లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు. జీడీవీఏ వృద్ధి 15.53 శాతం, జీడీడీపీ వృద్ధి 16.11 శాతం పెంచనున్నట్లు తెలిపారు. జిల్లాలో సర్వీస్ రంగం ద్వారానే అధిక ఆదాయం వస్తుందని, వ్యవసాయం రంగం ద్వారా రూ.8,600, ఉద్యాన పంటల ద్వారా రూ.6794 కోట్లు ఆదాయం వస్తుందని చెప్పారు. ఉద్యాన ఆదాయ వృద్ధి 15.61 శాతంగా నమోదవుతుందని అంచనా వేశామన్నారు. అన్ని రంగాల కంటే పశువులు, మాంసాహార, పాల ఉత్పత్తులు ద్వారా రూ.8147 కోట్లు, చేపలు, ఆక్వా సాగు ద్వారా రూ.2139 కోట్లు ఆదాయం నమోదు చేశామన్నారు. విద్యా రంగం ద్వారా రూ.4679 కోట్లు, రియల్ వ్యాపారం నుంచి రూ.4753 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశామని కలెక్టర్ తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (గురువారం సాయంత్రం) సహరి : 4.50 (శుక్రవారం ఉదయం)

కారంపూడిలో టెన్షన్ టెన్షన్

- ఉప ఎంపీపీ పదవి కోసం వైసీపీ క్యాంపు
- చేజారిపోకుండా రాత్రికి రాత్రి తరలింపు
- రంగంలోకి మాజీ ఎమ్మెల్యే పీఆర్కే అనుచరులు
- రక్షణ కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు

కారంపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఉప ఎంపీపీ ఎన్నిక స్థానికంగా టెన్షన్ రేకెత్తిస్తోంది. ఈనెల 27వ తేదీన ఉప ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. మండల పరిషత్‌లో 15 మంది ఎంపీటీసీలు ఉండగా వీరంతా గతంలో వైసీపీ హయాంలో ఏకగ్రీవమైన వారు. ప్రతిపక్ష పార్టీలను నామినేషన్ వేయకుండా అధికార యంత్రాగాన్ని అడ్డుపెట్టుకొని పోటీ లేకుండా చేసుకుంది. దీంతో ఎంపీటీసీ స్థానాలన్నీ వైసీపీ పరమయ్యాయి.

వైసీపీ క్యాంపు రాజకీయాలు

అధికారం కోల్పోగానే టీడీపీ వైపు వీరంతా దూకేస్తారనే భయం వైసీపీని వెంటాడుతూనే ఉంది. అందుకే వైసీపీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. వేపకంపల్లి ఎంపీటీసీ రెండో ఉప ఎంపీపీ అయిన కోక అక్కమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆ ఖాళీని పూర్తి చేయడానికి ఎన్నిక నిర్వహించవలసి వచ్చింది. పేటసన్నిగండ్ల రెండో ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవి అసెంబ్లీ ఎన్నికలకు ముందే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మిగిలిన 13 మందిలో ఒప్పిచర్ల ఎంపీటీసీ తటస్థంగా ఉన్నారు. మిగిలిన 12 మంది ఎంపీటీసీలను వైసీపీ కాపాడుకోవడం కోసం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన అనుచరులను రంగంలోకి దించి రాత్రికి రాత్రి రహస్య ప్రదేశానికి తరలించారు. ప్రస్తుతం మిరియాల ఎంపీటీసీ కొమ్మారెడ్డి విజయను ఉప ఎంపీపీగా ఎంపిక చేయడానికి క్యాంపు నిర్వహించుకుంటున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్

ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైసీపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. తమ ఎంపీటీసీలను ఎవరైనా నిరోధించవచ్చని, అడ్డు తగలవచ్చనే ఉద్దేశంతో రక్షణ కల్పించాలని హైకోర్టును కోరింది. దీంతో హైకోర్టు వైసీపీ ఎంపీటీసీలకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, వారు వస్తున్న వాహనాన్ని సీసీ కెమెరాలతో చిత్రీకరిస్తూ రక్షణ కల్పించాలని పోలీసు శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కారంపూడిలో ఉప ఎంపీపీ ఎన్నికల హాట్ హాట్‌గా మారింది.

కారంపూడి ఉప సర్పంచ్‌పై దృష్టి

కారంపూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పదవిపై టీడీపీ దృష్టి సారించింది. సర్పంచ్‌గా పనిచేసిన ప్రమీల తేజానాయక్ సెలవుపై వెళ్లడంతో ఉపసర్పంచ్ పదవి కీలకంగా మారనుంది. ఉప సర్పంచ్ సూర్య అంకారావు పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక నిర్వహిస్తున్నారు. టీడీపీ తరఫున బాణావత్ సర్వస్వతిబాయి ఉప సర్పంచ్‌గా ఎన్నిక కావడానికి రంగం సిద్ధం చేసుకుంది. ఎస్టీ మహిళకు సర్పంచ్ పదవి రిజర్వు కావడంతో ఎస్టీ మహిళగా గెలిచిన ఉప సర్పంచ్ బాధ్యతలు చేపడతారు. దీనిపై కూటమి నేతలు దృష్టి సారించారు.

ఆరు గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక

కారంపూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌తోపాటు మండలంలోని మరో ఆరు గ్రామాల్లో ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు. చింతపల్లి, చినగార్లపాడు, పేటసన్నిగండ్ల, ఇనుపరాజుపల్లె, ఒప్పిచర్ల, నరమాలపాడు గ్రామాల్లో సైతం ఖాళీ అయిన ఉప సర్పంచ్ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు.

31 కల్లా ఈకేవైసీ పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ సూరజ్ ఆదేశాలు

నరసరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ ప్రక్రియను ఈ నెల 31 కల్లా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జేసీ సూరజ్ ఆదేశించారు. ఈకేవైసీని లబ్ధిదారులతో సత్వరమే నూరు శాతం పూర్తి చేయించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో, రేషన్‌షాపుల్లో డీలర్ వద్ద ఉన్న ఈ-పోస్ పరికరాలు, మొబైల్ యాప్ ద్వారా ఈకేవైసీ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు మినహా, మిగిలిన లబ్ధిదారులకు తక్షణమే పూర్తి చేయాలన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థ సక్రమంగా అమలు, సరుకుల అక్రమ వినియోగాన్ని నివారించడానికి ఈకేవైసీ ఉపయోగపడుతుందన్నారు.

కోనూరు ఎంపీటీసీ అదృశ్యం

నేడు అచ్చంపేట ఎంపీపీ ఎన్నిక

అచ్చంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట ఎంపీపీ ఎన్నిక గురువారం జరగనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో కోనూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఎండ్రపల్లి నటరాజ్ అదృశ్యమైనట్లు ఆయన భార్య రోజా బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీపీ పదవిని ఎస్టీ మహిళకు రిజర్వు చేయగా తాడువాయికి చెందిన భూక్యా రజినీబాయి 2021 సెప్టెంబరులో బాధ్యతలు చేపట్టి 2024 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఉపాధ్యక్షుడిగా ఉన్న గంగసాని నరసింహారెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు గురువారం ఎంపీపీ ఎన్నిక జరగనుంది.

వీఆర్వో, సర్వేయర్లకు.. షోకాజు నోటీసులు

గురజాల ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గురజాల డివిజన్ పరిధిలోని 28 మంది వీఆర్వోలకు, 13 మంది విలేజ్ సర్వేయర్లకు షోకాజు నోటీసులు ఇచ్చినట్లు గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వేలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లపై ఫిర్యాదు రావడంతో చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రైతులు పాసు పుస్తకాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్న తరువాత ప్రభుత్వం ప్రకటించిన రుసుము కాకుండా వీఆర్వోలు రైతులు దగ్గర ఏమైనా ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించగా డివిజన్ పరిధిలోని 28 మంది వీఆర్వోలపై ఫిర్యాదులు వచ్చాయి. అలాగే డివిజన్ పరిధిలోని విలేజ్ సర్వేయర్లు రైతులు ఏదైనా భూమికి సర్వే చేసినప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రభుత్వం ప్రకటించిన రుసుం కాకుండా ఏదైనా ఎక్కువ మొత్తంలో వసూలు చేశారా అని ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించగా 13 మంది విలేజ్ సర్వేలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని షోకాజు నోటీసులు తీసుకున్న గ్రామాల వారీగా వీఆర్వోల వివరాలు ఇలా ఉన్నాయి.. గురజాల మండలంలో పులిపాడు - 1, పులిపాడు - 2, మాడుగుల, చర్లగుడిపాడు, పాత అంబాపురం, గురజాల - 3, దాచేపల్లి మండలంలో పెదగార్లపాడు, మాదినపాడు, పొందుగుల, భట్రుపాలెం, నడికుడి, దాచేపల్లి - 2, పిడుగురాళ్ల మండలంలో బ్రాహ్మణపల్లి, జూలకల్లు, జానపాడు, మాచవరం మండలంలో మల్లవల్లు, పిల్లుట్ల, తురకపాలెం, కారంపూడి మండలంలో మిరియాల, పెదకొదమగుండ్ల, దుర్గి మండలంలో పసర్లపాడు, మాచర్ల మండలంలో కొప్పునూరు, అమ్మానీ జమ్మలమడక, చింతలతండా, నెహ్రూనగర్, వెల్దుర్తి మండలంలో ఇరువురు వీఆర్వోలకు షోకాజు నోటీసులిచ్చినట్లు చెప్పారు. అలాగే డివిజన్ పరిధిలోని విలేజ్ సర్వేయర్లు గ్రామాల వారీగా షోకాజు నోటీసులు తీసుకున్న వారి వివరాలిలా ఉన్నాయి.. గురజాల మండలంలో దైద - 1, దైద - 2, మాడుగుల, గంగవరం, దాచేపల్లి మండలంలో పెదగార్లపాడు, పిడుగురాళ్ల మండలంలో జూలకల్లు, కరాలపాడు, కారంపూడి మండలంలో పెదకొదమగుండ్ల, దుర్గి మండలంలో పోలేపల్లి, ముటుకూరు, మాచర్ల మండలంలో మాచర్లటౌన్, రాయవరం, నాగులవరం గ్రామాల సర్వేయర్లకు నోటీసులు ఇచ్చినట్లు ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

మున్సిపల్ భూమి విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలి

● కేసానుపల్లి 167ఏ జాతీయ రహదారి బాధిత రైతుల డిమాండ్

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ భూమి విలువ ఆధారంగా రైతులకు పరిహారం చెల్లించాలని కేసానుపల్లి 167ఏ జాతీయ రహదారి బాధిత రైతులు డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలో ఆర్డీవో ఎం మధులతకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేసానుపల్లి రైతుల పొలాల మార్కెట్ విలువ ఎకరం రూ. 3 నుంచి రూ. 5



ఆర్డీవో ఎం మధులతకు వినతిపత్రం అందజేస్తున్న కేసానుపల్లి రైతులు

కోట్ల వరకు ఉందన్నారు. కొన్ని పొలాలు ఎల్‌టీనగర్‌కు దగ్గరగా ఉన్నాయని, మున్సిపాలిటి రిజిష్టర్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. కేసానుపల్లి పొలాలకు దగ్గరలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఫార్మసీ కాలేజి, ఇంజనీరింగ్, న్యాయ కళాశాల, అగ్రికల్చర్ కాలేజీలు ఉన్నాయన్నారు. 167-ఏ జాతీయ రహదారి కింద భూమిని కోల్పోతున్న రైతులందరికీ నరసరావుపేట రెవెన్యూ రైతులకు ఇచ్చిన పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోట్ల లక్ష్మీనారాయణ, వెంకట గోపి, తాతపూడ సంజీవరావు, మంచు సునీత, కోట కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వివాద స్థలంలోకి ఇరువర్గాలను అనుమతించవద్దు

● తహసీల్దార్ ఉత్తర్వులు

పిరంగిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పిరంగిపురంలోని శాంతిపేటలో గల 3.50 సెంట్ల వివాద స్థలంలోకి ఇరువర్గాలను అనుమతిం చవద్దని స్థానిక ఎస్ఐకి తహసీల్దార్ కే ప్రసాద్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న స్థల వివాదంలో సీఐ దురుసు ప్రవర్తనతో ఓ వ్యక్తి ని తుపాకితో కొట్టడం, ఆపై స్థానికులు సీఐని తరిమికొట్టడం, సీఐ సైడ్ కాల్వలో పడిపోటం, 3 గంటల పాటు రాస్తారోకో చేశా రు. దీంతో శాంతిపేటకు చెందిన ప్రజలు స్థానిక తహసీల్దార్, డీఎస్పీ టీ మురళీకృష్ణ, పంచాయతీ ఈవోలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వివాద స్థలం.. పొలేరమ్మ గుడి స్థలంగా 3.50 సెంట్ల స్థలం ఉన్నదని, దీనిని గ్యారా చిన్నికుమార్ తన ఇద్దరు కుమారులకు గిఫ్ట్ డీడీగా ఇచ్చారని తెలిపారు. దీనిపై కాలనీవాసులు అధికారులకు వినతి పత్రాల ద్వారా విషయం



వివాద స్థలంలో కొలతలు తీస్తున్న అధికారులు



శాంతిపేటలో ఇరువర్గాల సమక్షంలో కొలతలకు సిద్ధమైన అధికారులు

తెలిపిన సందర్భంగా.. వివాదాలు చెలరేగుతాయనే నేపథ్యంలో సీఆర్‌పీసీ 145 కింద ఆరు నెలల పాటు ఇరువర్గాలు ఆ స్థలంలోకి వెళ్లకుండా చూడాలని తహసీ ల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.

● కొలతలు తీసిన రెవెన్యూ అధికారులు

శాంతిపేటలో వివాదంలో ఉన్న స్థలంలో బుధవారం రెవె న్యూ, పంచాయతీ అధికారులు కొలతలు తీశారు. ఇరువర్గాల పెద్దల సమక్షంలో అధికారులు కొలతలు వేశారు. కార్యక్రమంలో ఆర్.ఐ షేక్ రెహమన్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో శ్రీనివాస్, ఈవో కిషోర్‌బాబు, సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారులు రాష్ట్రఖ్యాతిని పెంచాలి

◆ శాప్ చైర్మన్ రవినాయుడు ◆ వీవీఐటీయూలో నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్

పెదకాకాని, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ క్రీడాకారులు అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రఖ్యాతిని పెంచాలని శాప్ చైర్మన్ రవినాయుడు కోరారు. వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ "నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్" పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు, అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత సంజీవ సింగ్, వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆర్చరీ క్రీడకు విశేష ఆదరణ లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆర్చరీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న చెరుకూరి లెనిన్ వోల్గా అసోసియేషన్ కృషి ప్రశంసనీయం అన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం అని తెలిపారు. అమరావతి వేదికగా స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునట్లు వివరించారు. వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మార్చి 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు వీవీఐటీయూ క్యాంపస్ నందు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి 900 మంది ఆర్చరీ



నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్ రవినాయుడు, వీవీఐటీయూ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారని, అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించనున్న పోటీలలో తొలి రోజున 723 మంది పోటీదారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీయూ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్. అరుణ్ కుమార్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరి చెరుకూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు


● అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోటీ

గుంటూరు(లీగల్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్‌కు 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి యంగలశెట్టి శివ సూర్యనారాయణ (బబ్లూ), మధిర నాగేశ్వరరావు, కాజా భరద్వాజ, నంబూరు పాములు నలుగురు పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి మాలే దేవరాజు, చింతా రామ కోటిరెడ్డిల మధ్య ద్విముఖ పోరు జరుగుతుంది. ప్రధాన కార్యదర్శి పదవికి యరసాని అజయ్ కుమార్, మొఘల్ కాలేషా బేగ్, మోదుకూరి శ్రీనివాసరావు లు ముగ్గురు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరి పదవికి కొమ్మినేని చంద్రశేఖర్, ఐ విజయ్ వర్మల మధ్య ద్విముఖ పోరు నడుస్తుంది. ట్రెజరర్ పదవికి గూడూరి అశోక్ కుమార్, జీవీఎస్‌ఆర్‌కేఎస్ చంద్రన్ లు, లైబ్రరి సెక్రటరి పదవికి ఎం పాపిరెడ్డి, బొప్పా శ్రీనివాసరావులు పోటీలో ఉన్నారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరి పదవికి కుప్పాల హనుమంతరావు, గండికోట శేషగిరిరావులు పోటీ పడుతుండగా, లేడీ రెప్రజెంటేటివ్ పదవికి అడపా ఇందిర, పురాణం కళ్యాణిలు పోటీలో ఉన్నారు. నాలుగు సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు గాను మోర్ల బాల సుందరి, దాదా కరీం మొహమ్మద్, బండ్ల కృష్ణ, పల్లె నరసింహారావు, పొట్టిమూర్తి సురేష్‌కుమార్‌లు పోటీలో ఉన్నారు. మూడు జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు లింగాల మారుతీ శివ నాగప్రసాద్, షేక్ రెహనా బేగం, పెరుమాళ్ళ శివరంగ నాయకులు, రాయపూడి శ్రీనివాసరావులు నలుగురు పోటీపడుతున్నారు. లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు కుందేపు కవిత, మందా విజయ కుమారిల మధ్య ద్విముఖ పోరు జరుగుతోంది. మొత్తం 2016 మంది న్యాయవాదులకు ఈ ఎన్నికలలో ఓటు హక్కు వుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి 5 గంటల నుంచి పోల్ అయిన ఓట్లు లెక్కించి ఫలితాలు రాత్రికే వెల్లడించనున్నారు.

ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ పనులను రూ.1112.74 కోట్లతో చేపడుతున్నారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆయా ప్రాంగణాల్లో జంగిల్ క్లియరెన్స్ చేశాయి. అసంపూర్తిగా నిలిచిన భవనాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాల్ని తొలగిస్తూ మొత్తం ప్రాంతాన్ని శుభ్రం చేయించాయి. 2019 నాటికి కొన్ని 90 శాతం, మరికొన్ని 50 శాతం, ఇంకొన్ని పునాదుల దశ వరకు నిర్మాణపనులను జరుపుకున్నాయి. వీటిని అన్ని హంగులతో, పూర్తి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గెజిటెడ్ అధికారులు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-డీ అధికారుల కోసం మరో 1440 ఫ్లాట్‌ల నిర్మాణాన్ని గత టీడీపి ప్రభుత్వ హయాంలో చేపట్టగా అవి 66శాతం వరకు పూర్తయ్యాయి. ఇక నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కోసం నేలపాడు వద్ద మరో 1995 ఫ్లాట్లు వచ్చే విధంగా బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణాలను చేపట్టి 62 శాతానికి పైగా పూర్తి చేశారు. వీటన్నింటిని ఇపుడు మళ్లీ పూర్తిస్థాయిలో పునర్నిర్మించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించగా 2019లో నిలిచిపోయాయి. ముళ్ల కంపల నడుమ పాడుపడినట్లున్న ఈ భవన సముదాయాల పనులను ప్రభుత్వం తాజాగా చేపట్టింది. నిర్దేశించిన గడువుకన్నా ముందరే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆయా సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో గడువు పెంచేది లేదని తేల్చిచెప్పింది. నాణ్యత విషయంలో రాజీ పడటానికి వీలులేదని సూచించింది. ఈ భవన సముదాయాల్లో అంతర్గత రహదారులను ఏర్పాటుచేయడంతోపాటు ఇంటీరియర్ వర్కులు, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.



అమరావతిలో పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

ప్రకృతి వ్యవసాయం కోసం కలిసికట్టుగా పనిచేయాలి

రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామారావు

గుంటూరు సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ రామారావు స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ, సెర్ప్ సంస్థల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేస్తోందని, జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం గుంటూరు పట్టణంలోని రాయల్ పార్క్ హోటల్ నందు బుధవారం ప్రారంభమైనది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వ్యవసాయ శాఖకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ నుంచి డీపీఎం, ఏపీఎం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సలహాదారులు,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ డీవీ రాయుడు మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయం కారణంగా మొక్కలు, సూక్ష్మజీవుల మధ్య ఉండే సంబంధం బాగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిలో ఉచితంగా లభ్యం అయ్యే సూర్యకాంతిని వ్యవసాయ రంగానికి సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా పంట ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. ప్రొఫెసర్ దబోల్కర్ పరిశోధనలను ప్రస్తావిస్తూ బహుళ పంటల సాగు విధానాలు ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు ఎకరాలకు సమానమైన ఉత్పాదకతగా మార్చగలవని వివరించారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభాలు ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. అధిక రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా భూసారం తగ్గిపోవడం, కార్బన్ వ్యర్థాలు పెరగడం, నీటి కాలుష్యం వంటి ప్రభావాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం మెరుగుపడి, దిగుబడి పెరిగి, ఆహార పోషక విలువలు మెరుగవ్వడంతో పాటు పర్యావరణ స్థిరత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మేనేజ్ సంస్థ టెలీ సలహాదారు ఐశ్వర్య, సీనియర్ థిమాటిక్ లీడ్‌లు చంద్రశేఖర్, గోపీచంద్, డాక్టర్ జాకీర్ హుసేన్, థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ రామచంద్రం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు, చిత్రంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీవీ రాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

అద్దె బకాయిలు చెల్లించకపోతే చర్యలు

● పెదనందిపాడులో రూ.9.92 లక్షల వసూలు..
జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెదారులు బకాయిలు వెంటనే చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ హెచ్చరించారు. బుధవారం ఆయన గుంటూరు జిల్లా పరిషత్‌లో మాట్లాడుతూ జడ్పీ అద్దె బకాయిల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో భాగంగా పెదనందిపాడులో రూ.16.74 లక్షలు అద్దె బకాయిలు ఉండగా, స్పెషల్ డ్రైవ్ లో రూ.9.92 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు. చాలా మంది జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లు వాడుకుని అద్దెలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వుంటున్నారని, అటువంటి వాళ్ళ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.

29 జరగాల్సిన జడ్పీ సమావేశం వాయిదా

గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదీన గుంటూరులో జరగనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా బుధవారం తెలిపారు. 2025 - 2026 సంవత్సర బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలను అదనంగా చేర్చవలసి ఉన్నందున, మెజార్టీ సభ్యులు కొంత సమయం కోరిన కారణంగా వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

4 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 4న రాత్రి 7.30గంటలకు చిగురు మేఘం, 9..30కు కిడ్నాప్, 10.30కు విడాకులు కావాలి, 5న రాత్రి 7.30కు జనరల్ బోగీలు, 8.30కు నా శత్రువు, 9.30కు రుతువులేని కాలం, 10.30కు గురితప్పిన వేట, 6న రాత్రి 7.30కు నాన్న నేను వచ్చేస్తున్నా, 8.30కు బ్రహ్మస్వరూపం, 9.30కు బావా ఎప్పుడు వచ్చితివి మొదలగు నాటికలు ప్రదర్శితమవుతాయని సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



ఇంద్రసేనారెడ్డి (ఫైల్)

మాచర్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఐసర్ వెహికల్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణ శివారులోని ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నారాయణపల్లికి చెందిన ఎస్ ఇంద్రసేనారెడ్డి (26), ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన కాశిరెడ్డి (30)లు హైదరాబాద్ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం (ఏపీ39ఎన్‌క్యూ 1977)పై మాచర్ల వైపు వస్తుండగా ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద మాచర్ల వైపు నుంచి మొక్కజొన్న లోడుతో వెళ్తున్న ఏపీ29టీఏ 7692 ఐసర్ వెహికల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇంద్రసేనారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కాశిరెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన ఐసర్ వెహికల్ డ్రైవర్ పరారయ్యాడు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇంద్రసేనారెడ్డి ఆర్మీ జవానుగా విధులు నిర్వహిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

మంగళగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. తాడేపల్లికి చెందిన సంధ్యారాణిపై భర్త తగరపు నాగరాజు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు సంధ్యారాణి సెప్టెంబరు 3, 2022న ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టు విచారణలో నాగరాజుపై నేరం రుజువు కావడంతో నాగరాజుకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని బుధవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెంటపల్లి రాజేష్ బాధితురాలి తరపున వాదనలు వినిపించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : స్కూటీపై ఇంటికెళుతున్న ఓ వ్యక్తి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కంకటపాలెం గ్రామానికి చెందిన రావిపూడి సురేష్‌బాబు (66) బుధవారం స్కూటీపై బాపట్ల వచ్చి తిరిగి ఇంటికెళ్ళే సమయంలో విలియంబూత్ జూనియర్ కళాశాల వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు, పడిపోయిన ఆయనను స్థానికులు 108 ద్వారా ఏరియావైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రావిపూడి సురేష్ (ఫైల్‌ఫొటో)

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 521.20 అడుగులు ఉంది. ఇది 151.47 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 25,036 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,45,568 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,46,260 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,45,568 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 70,065 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12600
నంబరు. 5	10000	13100
273	10000	12600
341	10000	14100
4884	10000	11700
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13300

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10200	12500
ఆర్మూరు	10000	11200
తాలుకాయలు	5000	6500

యరపతినేని కోసం ముస్లింల ప్రార్థనలు

మాచవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా మాచవరంలోని మసీదులో బుధవారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోసం ముస్లింలు ప్రార్థనలు జరిపారు. గురజాల నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమం కోసం యరపతినేని ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అనేక ప్రయోజనాలు చేకూర్చారన్నారు. హజ్‌యాత్రకు వెళ్ళే ముస్లింలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశారన్నారు. గురజాల నియోజకవర్గ ముస్లిం అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు ముస్లింలు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయండి

జి తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు

మాచవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ కార్డులకు సంబంధించి ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలని ఆయా గ్రామాల వీఆర్‌వోలను, డీలర్లను తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. మండలం మొత్తం మీద 5,700మందికి ఈకేవైసీ చేయాల్సివుండగా ఇప్పటికి సుమారు 1200 మంది చేయించుకున్నారని, మిగిలిన వారు ఈ నెలాఖరు లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేయటంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బకాయిల చెల్లింపునకు 50 శాతం రాయితీ

దాచేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో బకాయిల చెల్లిపుపై 50శాతం రాయితీ ఇస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ అప్పారావు తెలిపారు. ఈనెల 31వ తేదీ లోగా బకాయిలు చెల్లించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వివరించారు.



బెల్లంకొండ రహదారి పక్కనే పడవేసిన వ్యర్థాలు

రోడ్డు పక్కనే వ్యర్థాలు..

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

బెల్లంకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు పక్కన వ్యర్థాలు, చెత్తాచెదారం పడవేయరాదని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆ విషయం బెల్లంకొండ పంచాయతీ అధికారులకు చెవికెక్కటం లేదు. బెల్లంకొండ-క్రోసూరు రహదారిలో రోడ్డు పక్కనే వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని పడవేసినప్పటికీ ఆ రహదారి గుండా మండలస్థాయి అధికారులు, పంచాయతీ అధికారులు తిరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేగాకుండా బెల్లంకొండ సచివాలయానికి, రైతుభరోసా కేంద్రానికి వెళ్ళాలంటే ఆ రహదారిలో వెళ్ళాల్సిందే. బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో ఉన్న దుకాణాల యజమానులు కోళ్లవ్యర్థాలను, చెత్తాచెదారాన్ని రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. ప్రయాణికులు దుర్గంధంతో అల్లాడుతున్నారు. వ్యర్థాలు పడవేసిన చోట కుక్కలు సంచరిస్తూ ద్విచక్ర వాహనదారుల వెంటపడి కరవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి పంచాయతీల్లో రోడ్డు పక్కనే ఉన్న వ్యర్థాలను, చెత్తాచెదారం తొలగించాలని, రోడ్ల వెంట వాటిని వేయకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

31లోగా రైతులు

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

నకరికల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఏవో కే దేవదాసు కోరారు. బుధవారం కుంకలగుంట జల్లాపేట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంక్షేమ పథకాలు పొందటానికి రైతులు ఫార్మర్ రిజిస్టర్ వెబ్‌సైట్‌లో రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వో కృష్ణకుమారి, ఉద్యానవన సహాయకుడు పీ శాయివెంకట్, పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ

నకరికల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చీమలమర్రి ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ బుధవారం వైభవంగా జరిగింది. ప్రసన్నాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఏకాహం నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చల్లా సురేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్ ప్రారంభం

నకరికల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్ ప్రారంభమవుతుందని ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. సదరం సర్టిఫికెట్ కావాల్సినవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త రాఘవయ్య మృతి

పిడుగురాళ్ళ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన బండ్ల రాఘవయ్య(87) హైదరాబాద్‌లోని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కొత్త వంగడాలపై అనేక పరిశోధనలు చేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారు. గత కొంతకాలంగా ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారు. రాఘవయ్య మృతికి పిడుగురాళ్ళ, జానపాడు గ్రామ టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.



బండ్ల రాఘవయ్య (ఫైల్‌ఫొటో)



ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్

లేమల్లెలో ఇఫ్తార్

● హాజరైన ఎమ్మెల్యే ప్రవీణ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా లేమల్లె గ్రామంలో స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు బుధవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక మసీద్‌లో జరిగిన ప్రార్థనల లో పాల్గొని ముస్లింలకు అభినందనలు తెలిపారు. తదుపరి జరిగిన సమావేశంలో వారు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం జరిగిన ఇఫ్తార్‌లో ముస్లింలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు పఠాన్ నూర్జహాన్, వెన్నా సాంబశివారెడ్డి, సంగండెయిరీ డైరక్టర్ వీ ధర్మారావు, జీడీసీసీబీ మాజీ డైరక్టర్ ఎన్‌వీవీ వరప్రసాద్, డీసీ చైర్మన్ బీ వెంకటేశ్వరరావు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కొండమోడు-నెమలిపురి గ్రామాల మధ్య ప్రమాదభరితపు మూలమలుపు

మృత్యుదారులు

● మూడు నెలలు.. పదుల సంఖ్యలో ప్రమాదాలు
● 8మంది మృతువాత.. 20మందికి పైగా గాయాలు

రాజుపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అతి వేగం... నిర్లక్ష్యం... బాధ్యతారాహిత్యంగా నడపడం... వెరసి ఘోర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి ప్రమాదాల్లో చాలామంది తగిన జాగ్రత్తలు పాటించకపోవటం వలనే మృతి చెందుతున్నారు. తద్వారా కుటుంబసభ్యులు వేదన అనుభవించాల్సి వస్తుంది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గుంటూరు-మాచర్ల, అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రాజుపాలెం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో కేవలం మూడు నెలల వ్యవధిలో 8మంది మృత్యువాత పడ్డారు. 20మంది పైగా గాయపడ్డారు. రెడ్డిగూడెం, నెమలిపురి, దేవరంపాడు, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో ప్రమాదభరితంగా వున్న రోడ్లపై ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతు ్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చొరవతో కొండమోడు-పేరేచర్ల రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి విస్తరణ పనులు వేగవంతం చేసి ప్రమాదాలను నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.



నెమలిపురి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన లారీ (పాతచిత్రం)

రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం

- రాజుపాలెం ఎస్సై వేణుగోపాల్

రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ద్విచక్ర వాహనదారుడితో పాటు వెనుక కూర్చొన్నవారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలి. రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు.

నేడు ఉప సర్పంచ్ ఎన్నికలు

మాచవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు బుధవారం తెలిపారు. మాచవరం, పిన్నెల్లి, వేమవరం గ్రామాలకు ఉప సర్పంచ్‌లు రాజీనామా చేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 11గంటలకు ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతుందని, ఇప్పటికే ఎన్నికకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

● మాచర్ల రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మాని జమ్మలమడక, రాయవరం గ్రామాల ఉపసర్పంచ్‌ల ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. రాయవరం ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, అమ్మాని జమ్మలమడక ఎన్నికల అధికారిగా పంచాయతీరాజ్ ఏఈ సత్యనారాయణ వ్యవహరించనున్నారు. రాయవరం ఉప సర్పంచ్ పత్తిపాటి సుందరలీల, అమ్మానీ జమ్మలమడక ఉప సర్పంచ్ ముక్కా చౌడమ్మలు రాజీనామా చేశారు. దీంతో ఉప సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనసేన సానుభూతిపరులు దాసరి లక్ష్మి బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు, టీడీపీ నేత కే నవీన్‌లు మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటఅప్పారావు ఆదేశాలమేరకు లక్ష్మి కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయాన్ని అందించారు.

వేసవిలో పశు యాజమాన్యం

సత్తెనపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో అత్యధిక వేడి అన్ని రకాల పశువులపై తీవ్ర ఒత్తిడిని కలుగచేస్తుందని పశు సంవర్థక శాఖ సత్తెనపల్లి సహాయ అధికారి డాక్టర్ ఎం నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల నీటితొట్టెల ద్వారా పరిశుభ్రమైన చల్లని తాగునీరు సరిపడినంత నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. నీటి తొట్టెలను ఒకేసారి ఎక్కువ పశువులు తాగేందుకు వీలుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువుల షెడ్ల చుట్టూ గోనెసంచులు కట్టి వాటిని చల్లని నీటితో తడపాలన్నారు. పశువులకు మేతను రాత్రివేళల్లో అందుబాటులో ఉంచాలన్నారు. దీనివల్ల ఎక్కువ మేతను తింటాయన్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల పశువులు రోగాల బారినపడినా, శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతున్నా వ్యవసాయ పనులు చేయించకూడదన్నారు. అధికంగా, వేగంగా శ్వాస తీసుకోవటం, నీరు ఎక్కువగా తాగటం, ఆహారం తినటానికి ఆసక్తిని కోల్పోవటం వంటి లక్షణాలు పశువులు కలిగి ఉంటాయన్నారు. పశువులు ఎటువంటి ఇబ్బందులకు గురైనా పశు వైద్యశాలల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నాలుగు గ్రామాల్లో పల్లె పుష్కరిణి

● ఒక్కోదానికి రూ.12.50లక్షలు విడుదల
● ఏపీవో జయచంద్ర

రెంటచింతల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో జల సంరక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీవో జయచంద్ర చెప్పారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లె పుష్కరిణి పేరుతో చెరువుల అభివృద్ధికి రెంటచింతల, తుమ్మకోట, మల్లవరం, పాలువాయి గ్రామాల చెరువులకు ఒక్కోదానికి రూ.12.50లక్షల చొప్పున రూ.50లక్షలు, 160 ఫారం పాండ్స్ నిర్మాణానికి రూ.80లక్షల్లు, వ్యక్తిగత కంపోస్టు ఎరువు తయారీకి రూ.11 లక్షలు, పశువులకు 30 మంచినీటి తొట్ల నిర్మాణానికి రూ.9లక్షలు మంజూరయ్యాయన్నారు. మొత్తం రూ.1.50కోట్లతో చేపట్టబోయే పనులను జూన్ ఆఖరు కల్లా పూర్తిచేయాల్సి ఉందన్నారు. ఏప్రిల్ 7వ తేదీలోగా గ్రామసభల్లో ఆమోదం పొందాల్సి ఉందన్నారు.

మే 11న కృత్రిమ చేతుల పంపిణీ

పిడుగురాళ్ళ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ళ, మంగళగిరి రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ చేతుల పంపిణీ శిబిరం మే 11వ తేదీన పిడుగురాళ్లలో తొలిసారిగా ఏర్పాటుచేస్తున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు తెలిపారు. బుధవారం పిడుగురాళ్లలో రోటరీక్లబ్ సభ్యుల విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అమెరికా నుండి దిగుమతి చేసుకొన్న కృత్రిమ చేతుల అమరిక రోబోటిక్ సర్జరీ సాయంతో అమర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీ మోహన్‌రావు, పంగులూరి విష్ణుబాబు, అనిల్‌చక్రవర్తి, జుజ్జూరి మురళీ, గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్, నీరుమళ్ల రాజేష్, గుర్రం కృష్ణకాంత్, ప్రోగ్రామ్ కన్వీనర్లు కోట రమేష్, గర్రె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



రోబోటిక్ సర్జరీ వివరాలను వెల్లడిస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు తదితరులు

ఏప్రిల్ నుంచి డిజిటల్ లావాదేవీలు

దాచేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకొని ఏప్రిల్ నుంచి దాచేపల్లి వీరాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని పర్సన్ ఇన్‌చార్జ్ కడప శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నారాయణపురంలోని పీఏసీఎస్‌లో రైతులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్‌లో నమోదు ద్వారా వివిధ ప్రయోజనాల గురించి వివరించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి సంఘంలో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సదుపాయాలు కల్పించామని తెలిపారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ వల్ల రైతులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించటంతో పాటు వ్యవస్థ సమర్థవంతంగా మారుతుంది. కార్యక్రమంలో టీడీపీ నేతలు నర్రపుల్లయ్య, అక్కినపల్లి బాలయ్య, సీఈవో కాశీవరపు సాంబశివరావు, అనుముల మల్లికార్జునరెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు

త్వరితగతిన చెల్లించాలి

● కమిషనర్ శివన్నారాయణ

గురజాలటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీలో ఆస్థి, ఖాళీస్థలాల పన్ను బకాయిలు త్వరితగతిన చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ శివన్నారాయణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పన్ను బకాయిలు ఈనెలాఖరు లోపు చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటికే పన్ను వడ్డీతో చెల్లించిన వారందరికీ వర్తిస్తుందన్నారు. ఆస్థిపన్ను మొత్తంలో గతంలో సగం చెల్లించి మిగిలిన బకాయిలున్నవారు కూడా ఈనెలాఖరు లోపు ఏక మొత్తంలో చెల్లిస్తే వారికి కూడా వడ్డీరాయితీ వర్తిస్తుందన్నారు. ఈ నెలలో పండుగ సెలవు రోజుల్లోనూ కౌంటర్లు పనిచేస్తాయని కమిషనర్ తెలిపారు.

28న రుణమేళా

మాచర్లటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు ఈ నెల 28వ తేదీన రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్ తెలిపారు. అభ్యర్థులు అప్లికేషన్ ఫారం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ పత్రాలు రెండు సెట్లతో మేళాకు హాజరుకావాలన్నారు.

రైతు గుర్తింపు కార్డులు

ఆన్‌లైన్ చేయించుకోవాలి

దుర్గి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతు గుర్తింపు కార్డులు ఆన్‌లైన్ చేయించుకోనివారు గురువారం స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద హాజరుకావాలని ఏవో అమ్మిరెడ్డి బుధవారం తెలిపారు. ఆధార్‌కార్డు, పొలం పాసుబుక్, ఆధార్ లింకైన ఫోన్ నంబరు వెంట తెచ్చుకోవాలన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాల

కేటాయింపు నిర్ణయంపై హర్షం

క్రోసూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలకు నివేశన స్థలాలు వెంటనే కేటాయించాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించటం పట్ల స్థానిక టీడీపీ నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగులకు ఏప్రిల్ తొలి వారంలోనే మెగా డీఎస్సీ ప్రకటించాలని నిర్ణయించటం హర్షణీయమన్నారు. తొమ్మిది నెలల పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమానస్థాయిలో అమలు చేయటం పట్ల రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆయనతో పాటు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకుడు దుద్దుల యోహాన్, టీడీపీ నాయకులు రామాంజనేయులు, నలజాల కోటేశ్వరరావు, అనుమాల పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 30.05 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నవోదయకు నకరికల్లు విద్యార్థి

నకరికల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పెరికల మేరీ వెరోనిక నవోదయ పాఠశాలకు ఎంపికైనట్టు హెచ్ఎం హనిమిరెడ్డి తెలిపారు. 6వ తరగతి ప్రవేశపరీక్షా ఫలితాల్లో ఎంపికైన వేరొనికను ఎంఈవో ప్రసాదరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు అభినందించారు.

క్రెడిట్ క్యాంపునకు 162మంది హాజరు

ఎంపీడీవో వెంగళరావు

మాచవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్రెడిట్ క్యాంపునకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 162మంది హాజరైనట్టు ఎంపీడీవో వెంగళరావు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆయా బ్యాంకుల్లో రాయితీ రుణాలు పొందేందుకు సుమారు మూడు వందల మంది అర్జీలు పెట్టుకున్నారని, వీరిలో 162మంది హాజరయ్యారని తెలిపారు. క్రెడిట్ క్యాంపునకు ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఎంపీడీవో కార్యాలయం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాచవరంలో క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తున్న ఎంపీడీవో వెంగళరావు తదితరులు

కార్పొరేషన్ రుణాలకు 140మంది హాజరు

- ఎంపీడీవో సరోజనిదేవి

రెంటచింతల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారు 140మంది హాజరైనట్లు ఎంపీడీవో కే సరోజనిదేవి చెప్పారు. కార్పొరేషన్ రుణాల కోసం బీసీ, రెడ్డి, ఈడబ్ల్యూఎస్, కమ్మ, కాపు వర్గాలకు చెందినవారు దరఖాస్తులు చేశారన్నారు. ఎస్బీఐ, యూనియన్, సీజీజీబీ బ్యాంక్‌లకు చెందిన మేనేజర్లు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాచేపల్లిలో రేపు క్రెడిట్ క్యాంపు

దాచేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీన క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రత్నం బుధవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ, ఈబీసీ, జనరల్ ఫార్మసీ రుణ అర్హతమేళ నిర్వహిస్తున్నట్టు వివరించారు. బ్యాంక్ అధికారులు హాజరవుతారని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెల్దుర్తిలో నేడు...

వెల్దుర్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు క్రెడిట్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ క్యాంపులో పలు బ్యాంకుల అధికారులు పాల్గొననున్నట్లు చెప్పారు. సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పాల్గొనాలని సూచించారు.

అమరావతిలో...

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ప్రభుత్వ రుణాలకోసం అర్జీదారులకు గురువారం ఉదయం 9గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. 59మంది లబ్ధిదారులకు 512మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో బీసీ 31, ఈబీసీ 3, కమ్మ 4, రెడ్డి 2, వైశ్య 1తోపాటు చంద్రన్న స్వయం ఉపాధి కింద కాపు, బలిజ, ఒంటరి కులాలకు 18మందిని ఎంపికచేయాల్సివుంది. ఇంటర్వ్యూలలో బ్యాంక్ మేనేజర్లు, బీసీ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు.



టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నలుగురిని కలుపుకుపోయే వాడే నాయకుడు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నలుగురిని కలుపుకుపోయే వాడే నాయకుడని.. గ్రూపులు కడితే నా దృష్టిలో గౌరవం తగ్గినట్టేనని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. బుధవారం మండలంలోని రాజుపాలెం కల్యాణ మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అధ్యక్షతన పార్టీ సభ్యత్వకార్డుల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ పదవులు అనుభవించటానికి నాయకులందరూ ముందుకు వస్తున్నారు కానీ పార్టీ పనిచేయటానికి ఈ మండలంలో నాయకులు ముందుకు రావటం లేదన్నారు. ప్రతి ఒక్కరూ కేఎస్ఎస్‌లో సభ్యులుగా ఉండాలన్నారు. రెండు రోజులలో కుటుంబ సాధికార సారధులను ఏర్పాటుచేసి లిస్టును తమకు అందజేయాలని సూచించారు. ప్రతి 60మంది ఓటర్లకు ఒక సారథి ఉంటారని, వారు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయటంతో పాటు గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలను స్వీకరించి అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, గుత్తా వెంకట్రావు, సాగి కోటేశ్వరరావు, అంకాళ్ల ప్రభుదాసు, మర్రి వెంకట్రామిరెడ్డి, మద్దిరాల గంగాధర్, జంగం రాజా, అంచుల నరసింహరావు, శనగపూల నరసింహరావు, వర్ల శ్రీను తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెం గ్రామంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. బుధవారం మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఓర్సు ఏడుకొండలు, సర్పంచ్ ప్రసాదు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో టీడీపీ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరావు, రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మేరీ సుజన్ బుధవారం తెలిపారు. 6వ తరగతి ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10గంటల నుంచి 12 మధ్య జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరుకావాలంటే గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో నిరవధికంగా చదివి ఉండాలని, ఓసీ, బీసీ విద్యార్థులు సెప్టెంబరు 1, 2013 నుంచి ఆగస్టు 31, 2015 మధ్య జన్మించి ఉండాలని, రూ.150 రుసుం చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ప్రవేశరుసుంతో సెప్టెంబరు 1, 2011 నుంచి ఆగస్టు 31, 2015 లోపు జన్మించి ఉండాలన్నారు. ఎంట్రన్స్ పరీక్షలో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని, ఒకసారి ప్రవేశం పొందితే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడు సంవత్సరాల పాటు పూర్తిస్థాయి ఇంగ్లీషు మీడియంలో ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా విద్యను అభ్యసించవచ్చన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవటానికి అర్హులని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశం లభిస్తుందన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.150 దరఖాస్తు ఫీజును నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశాలు 10వ తరగతి మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఇవ్వబడతాయన్నారు. పూర్తి వివరాలకు అన్ని మండలాల మండల విద్యా వనరుల కేంద్రాల్లో గాని, క్రోసూరు మోడల్ స్కూల్‌లో గాని సంప్రదించాలన్నారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

నేడు బహిరంగ వేలం

బెల్లంకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న కోల్లూరు ఆంజనేయస్వామి దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు బొమ్మలు అమ్ముకొనే హక్కు, కూల్‌డ్రింక్స్ క్యాంటీన్ నిర్వహించుకొనే హక్కు, తలనీలాలు పోగుచేసుకొనే హక్కులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు దరఖాస్తు సొమ్మును డీడీ ద్వారా చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్నవారు నగదును వెంటనే చెల్లించాలని ఈవో సూచించారు.



- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కేజీబీవీలు..
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్

పేద విద్యార్థినులకు వరం.. కేజీబీవీలు

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థినులు (డ్రాపవుట్స్), తల్లిదండ్రులకు దూరమైన అనాథ విద్యార్థినులకు అవి దేవాలయాలు.. విద్యార్థినులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించడం తోపాటు వారి సర్వతో అభివృద్ధికి అవి బాటలు వేస్తాయి... ఆ విద్యాలయాలే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) ఇందులో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది.

ఇంటర్ వరకు ఉచిత విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి... ఇందులో 6 నుంచి ఇంటర్ వరకు ప్రవేశం కల్పిస్తారు. ఆయా కేజీబీవీలో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విద్యాలయాల్లో విద్యార్థినులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యను అందిస్తారు. ఈ (2025-26) విద్యా సంవత్సరానికి గాను 6, 11తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

వీరికి ప్రాధాన్యం

అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు https:apkgbv.apcfss.in అనే ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు. సందేహాలకు 70751-59996, 70750-39990 నంబర్లలో సంప్రదించ వచ్చు.

సాగర్ ఎయిర్‌పోర్టుకు.. భూ సేకరణ



సాగర్ మినీ ఎయిర్‌పోర్టులో రన్‌పై ఉన్న శిక్షణ సంస్థకు చెందిన విమానం (ఫైల్‌ఫోటో)

నెరవేరనున్న పల్నాటి వాసుల కల



భూమి వివరాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు (ఫైల్‌ఫోటో)

మాచర్లటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరం లో నాగార్జున సాగర్ రిజర్వాయర్, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే బౌద్ధ మ్యూజియం, లాంచీ ప్రయాణం వంటి సదుపాయాలతో ఆకర్షిస్తోంది. దీనికి తోడు ఎయిర్‌పోర్టు నిర్మాణం మరింత దోహదపడనుంది. ఎంతో కాలం నుంచి పర్యాటకులు ఎదురుచూస్తున్న ఎయిర్‌బస్ త్వరలో నాగార్జున సాగర్ వద్ద దిగనుంది. ఇప్పటికే భూసేకరణ వేగవంతంగా సాగుతోంది.

నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో..

నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నిర్మాణం అనంతరం ప్రధాని ఇందిరాగాంధీ రాకపోకల కోసం 1955లో మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ దక్షిణ విజయపురి రైట్‌బ్యాంక్ వద్ద 120 ఎకరాల్లో చిన్న విమానాశ్రయాన్ని ఏర్పాటు చేశారు. తదుపరి రాకపోకలు లేక విమానాశ్రయం మూలనపడింది. 2010లో ఫ్లయిటెక్ అనే సంస్థకు కోచింగ్ నిర్వహించుకునేందుకు అనుమతులు లభించాయి. మినీ ఎయిర్‌పోర్టులో సింగిల్ ఇంజన్, రెండు సీట్ల విమానాలతో శిక్షణ పొందుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో విస్తరణ దిశగా...

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఏడు విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దీనిలో నాగార్జున సాగర్ ఎయిర్‌పోర్టుకు కూడా స్థానం దక్కడం విశేషం. ఎయిర్ పోర్టు నిర్మించాలంటే భూసేకరణ తప్పనిసరి. మినీ ఎయిర్‌పోర్టు సమీపంలోని బ్రహ్మానందపురంతండా, పశువేముల, నాగులవరం, చింతలతండా గ్రామాల్లోని రెవె న్యూ భూములు, అటవీశాఖ భూములు సుమారు 1670 ఎకరాలు సేకరించాల్సి ఉంది. కొనుగోలు చేయ కుండానే ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండడం విమానాశ్రయం ఏర్పాటుకు కలిసొచ్చిన అంశం. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ప్రత్యక్షంగా మినీ ఎయిర్‌పోర్టు పరిసరాలను పరిశీలించారు. త్వరలోనే రెవెన్యూ భూములతోపాటు అటవీశాఖకు సంబంధించిన 500 ఎకరాలు కూడా కావాల్సి ఉండడంతో ఆ దిశగా సర్వే నిర్వహిస్తున్నారు. త్వరలోనే భూ సేకరణ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.


పర్యాటకరంగానికి ఊతం..

ఎయిర్‌పోర్టు విస్తరణ జరిగితే పూర్తిస్థాయి విమానాశ్రయంగా రూపొంది విమానాల రాకపోకలు జరుగుతాయి. దీంతో నాగార్జున సాగర్, అనుపు, ఐల్యాండ్ మ్యూజియం, బుద్ధ పూర్ణిమ, ఎత్తిపోతల వంటి ఆకర్షణీయ ప్రదేశాలు పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండి స్పిల్‌వే ద్వారా దిగువ కృష్ణానదికి పరుగులు పెడుతున్నప్పుడు పర్యాటకులు సాగర్‌ను సందర్శించేందుకు అమితంగా ఇష్టపడుతుంటారు. బౌద్ధ క్షేత్రంగా బాసిల్లిన నాగార్జున సాగర్‌ను సందర్శించేందుకు టిబెట్, నేపాల్, శ్రీలంక, బూటాన్ దేశాలకు చెందిన బౌద్ధ బిక్షుల రాకపోకలకు అనువుగా ఉండనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పర్యాటకుల రాకపోకలకు, పల్నాడులో మొట్టమొదటి ఎయిర్‌పోర్టుగా స్థానం దక్కించుకోనుంది.

ఆకులన్నీ రాలిన చోటే... కొత్త చిగురు



ఆకులన్నీ రాలిన చోటే... కొత్త చిగురు కనిపిస్తుంది అని ఒక కవి రాసిన పాట ఇలాంటివి చూసినప్పుడే గుర్తుకొస్తుంది. వేసవికాలం వల్ల ఆకులన్నీ రాలి మోడు



బారిన కొమ్మలకు మూడు రోజుల అనంతరం కొత్త చిగురు వచ్చి ఆకుపచ్చగా గుంటూరులోని బ్రాడీపేటలో కనిపించిన చెట్టు. -గుంటూరు, ఆంధ్రజ్యోతి

ఈ-క్రాప్‌లో నమోదు.. 230 మంది మాత్రమే

- యార్డులో అమ్మకందారులంతా రైతుల వద్ద కొనుగోలు చేసిన వాళ్లే
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ ఎంఐ స్కీమ్ అమలు అసాధ్యం
- దీనిని అవకాశంగా మార్చుకొంటున్న కొందరు వ్యాపారస్థులు



గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చికి కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద ప్రకటించిన కనీస మద్దతు ధరని ఇక్కడి రైతులు పొందలేని పరిస్థితి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో నెలకొన్నది. ఈ స్కీమ్ నిబంధనలలో కీలకమైన ఈ-క్రాప్ బుకింగ్‌లో రైతులు ఎవరూ తమ పంట సాగు, విస్తీర్ణాన్ని నమోదు చేసు కోవడం లేదు. ఏ కొద్దిమందో తప్పితే మిగతా రైతులంతా పట్టించుకోవడం లేదు. మరోవైపు రైతు లకు ముందుగానే పెట్టుబడి పెడుతున్న వ్యాపారస్తులు పంట చేతికొచ్చాక వేరే వాళ్ల పేర్లతో యా ర్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుండటంతో ఈ-క్రాప్ బుకింగ్‌లో ఆ వివరాలు కనిపించడం లేదు. ఈ ఏడా ది మిర్చి సీజన్ ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు యార్డులో జరిగిన అమ్మకాలకు సంబంధించిన వివరాలను మార్కెటింగ్ అధికారులు పరిశీలన చేయగా కేవలం 230 మందికి మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ జరిగివున్నట్లు తేలింది. దీంతో వాళ్లకు మాత్రమే ఎంఎస్‌పీని అమలు చేసే పరిస్థితి ఉన్నది.

మిర్చియార్డులో ఈ సంవత్సరం వింత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు కారణం సీజన్ ప్రారంభయ్యేనాటికి కోల్డ్‌స్టోరేజ్‌లలో 50 లక్షల టిక్కీలు(ఒక్కోటి 45 కేజీలు) వరకు నిల్వ ఉన్నాయి. దీని వలన వాటిని రైతులు యార్డుకు తీసుకురావడం, మరోవైపు కొత్త పంట రావడంతో మార్కెట్‌లో ధర పెరగలేదు. క్వింటాల్ రూ. 10 వేల మధ్యనే కొనసాగింది. సంక్రాంతి పండగ తర్వాత కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు 20 లక్షల టిక్కీలకు తగ్గిపోవడంతో, అదే సమయంలో ఎగుమతులు ప్రారంభం కావడంతో ధరలో కాస్త పెరుగుదల కనిపించింది. క్వింటాల్ రూ. 11 వేల నుంచి రూ. 13 వేల మధ్యన కొనసాగింది. ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మిర్చికి కనీస మద్దతు ధరని రూ. 11,781గా నిర్ణయించింది. దీంతో మార్కెట్ ఊపందుకొంటుందని అంతా భావించారు. అయితే ఈ స్కీమ్ ద్వారా లబ్ధి పొందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి కావడంతో ఏ కొద్దిమంది రైతులకు మాత్రమే అక్కరకు వచ్చే పరిస్థితి తలెత్తింది.

నిత్యం లక్షా 20 వేల టిక్కీల విక్రయం మిర్చియార్డులో జరుగుతున్నది. రోజుకు కనీసం 1500 నుంచి 2 వేల మంది రైతులు రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా సరుకు తీసుకొస్తున్నారు. ఈ కారణంగా ఎవ్వరి పేర్లు ఈ-క్రాప్ బుకింగ్‌లో మ్యాచింగ్ కావడం లేదు. ఈ సీజన్‌లో కనీసం లక్ష మంది రైతులు తమ మిర్చిని విక్రయించి ఉంటారని అంచనా. అయితే వారిలో కేవలం 230 మంది పేర్లు మాత్రమే ఈ-క్రాప్‌లో సరితూగడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొంతమంది వ్యాపారస్థులు ధర పెరగకుండా అడ్డుకొంటున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. రైతుల మిర్చికి ప్రభుత్వం ఎంఎస్‌పీ చెల్లించలేదు కాబట్టి తేమ శాతం అధికంగా ఉందని, తాలు ఎక్కువగా ఉందని, సైజులు లేవని పేర్కొంటూ ధర కోత పెడుతున్నారు. ఈ కారణంగానే క్వింటాల్ మిర్చి నేడు మార్కెట్‌లో రూ. 7 వేల నుంచి రూ. 9 వేల మధ్యనే ఉన్నది. యార్డుకు వచ్చే సరుకులో 85 శాతం ఈ కోవలోనే ఉంటున్నాయి. కేవలం 10 నుంచి 15 శాతం మిరపకాయలు మాత్రమే నాణ్యతగా ఉన్నాయని వాటికి అధిక ధర చెల్లిస్తున్నారు.

చెన్నకేశవుని భూములు హాంఫట్

- వేల ఎకరాలు అన్యాక్రాంతం
- దాతల సహకారంతో ఉత్సవాలు
- విలువైన భూములు ప్లాట్లుగా వేసి వ్యాపారం



శ్రీ చెన్నకేశవ స్వామి మూల విరాట్



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

మాచర్లటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 13వ శతాబ్దంలో పల్నాటి బ్రహ్మనాయుడు చేత పునర్నిర్మితమై పల్నాటి ప్రజల ఇలవేల్పుగా బాసిల్లిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయ వేలాది ఎకరాల భూములు కాలక్రమంలో కరిగిపోయాయి. విలువైన భూములు పరాధీనమైపోయాయి. మాచర్ల అనగానే గుర్తుకొచ్చే చెన్నకేశవస్వామి ఆలయం పూర్వకాలం నాటి భూస్వాములు, భక్తులు సమర్పించిన భూములు నేడు కబ్జాకు గురై అన్యాక్రాంతమైపోయాయి. ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడంతో ఆలయ నిర్వహణ దాతల సహకారంతో నడవాల్సిన దుస్థితి నెలకొంది...

సంపన్న చెన్నకేశవుడు..

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంకు సుమారు 3 వేల ఎకరాలు దాతల ద్వారా సంక్రమించింది. ఆలయ ధూపదీప నైవేద్యాల కొరకు పూర్వీకులు ఆలయానికి ఆ భూములు అప్పగించారు. ఆ భూముల కౌలు ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహించే వారు. నిత్య అన్నదానం నిర్వహించడం కూడా జరిగేది. కాలక్రమంలో 3 వేల ఎకరాలు పరాధీనమై సుమారు 30 ఎకరాలు స్థితికి చేరుకుంది. జమ్మలమడక అగ్రహారం కింద 1200 ఎకరాలు ఉండేది. 1948 ఎస్టాబ్లీష్‌మెంట్ యాక్టు ద్వారా కౌలుకు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అలాగే 1956లో కన్వర్షనల్‌ఆఫ్ ఈనామ్ యాక్టు ద్వారా ప్రభుత్వం మరో 250 ఎకరాలను పంపిణీ చేసింది. దీంతో సుమారు 1500 ఎకరాల భూమి ఆదాయం కోల్పోయింది.



రియల్ ఎస్టేట్‌గా మారిన ప్లాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అన్యాక్రాంతమైన విలువైన భూములు

మాచర్ల పట్టణంలో అత్యంత విలువైన చెన్నకేశవస్వామి భూములు అన్యాక్రాంతమయ్యాయి. నరసరావుపేట రోడ్డులో రహదారికి ఇరువైపులా ఎకరం రూ. 5 కోట్లు విలువ చేసే భూములు ఆక్రమించుకున్నారు. ఈ భూములు అప్పట్లో ఆలయంలో పనిచేసే మేళగాళ్లు, మోతబోయలు, నాయీ బ్రాహ్మణులు, కళావంతులు, వెట్టి, వడ్రంగి, కంసలి, రజక, భట్రాజులు సాగు చేసుకొని స్వామి వారికి సేవ చేసేందుకు అప్పగించిన భూములు అవి. చాకిరి మాన్యాలుగా ఉన్న భూములను ఆయా వర్గాల ప్రజలు నుంచి పలుకబడి ఉన్న నేతలు కాజేశారు.

రియల్ ఎస్టేట్‌గా మార్చి ప్లాట్లు పెట్టి విక్రయాలు..

నరసరావుపేట రోడ్డులో బడుగు, బలహీన వర్గాల నివాస స్థలాల కోసం 20 ఏళ్ల క్రితం 15 ఎకరాలు భూమి నామినల్ రేటుకు దేవాదాయ శాఖ విక్రయించింది. దాన్ని అదునుగా చేసుకొని ఆనుకొని ఉన్న మరో 5 ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీనికితోడు ఎర్ర రాయి క్వారీలకు 20 ఎకరాల పైచిలుకు పనికి రాకుండా పోయింది. క్వారీ గుంతలను కూడా పూడ్చి భూకబ్జాదారులు అమ్మేసుకున్నారు. ప్రస్తుతం చెన్నకేశవ నగర్, బైపాస్ రోడ్డుకు మధ్యలో ఉన్న 12 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్‌గా మార్చి ప్లాట్లు పెట్టి క్రయ విక్రయాలు జరుపుతున్నారు.

దాతల సహకారంతో ఉత్సవాలు..

వేలాది ఎకరాలు కలిగి సంపన్నునిగా ఉన్న చెన్నకేశవ స్వామి దశాబ్ధాల తరువాత ఆ భూములు కోల్పోయి ఆదాయం లేక దాతలు సహకారంతో ఉత్సవాలు జరుపుకునే స్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో రోజుకో వాహనంపై ఊరేగించి రథోత్సవాలు జరుపుకుంటారు. స్వామి వారి హుండీ ద్వారా వచ్చే ఆదాయం, దాతలు ఇచ్చే చందాలతో అరకొర ఖర్చులతో ఉత్సవాలు జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

16బై2013 చట్టం అమలు పరిస్తేనే...

చెన్నకేశవస్వామికి చెందిన అన్యాక్రాంతమైన చాకిరి మాన్యాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే 16బై2013 చట్టం అమలుపరచాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం సర్వీసు ఈనాం భూములన్నీ తిరిగి ఆ దేవాలయానికే దక్కుతాయి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడకపోవడంతో యాక్టు అమలు జరగడం లేదు. అన్యాక్రాంతం అవుతున్న భూములపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆక్రమణకు గురవుతున్న భూములను కాపాడుకునేందుకు దేవాదాయ శాఖ అధికారులు చొరవ చూపకపోవడం కూడా ఆలయానికి గ్రహణంగా మారింది. రీ సర్వే జరిపి చెన్నకేశవుని భూములను తిరిగి దక్కించుకుంటే కోట్ల రూపాయలు విలువైన ఆస్థులు స్వామి వారికి దక్కనున్నాయి. ప్రభుత్వం స్పందించి చెన్నకేశవస్వామి భూములను తిరిగి రప్పించగలిగితే స్వామి వారికి పూర్వవైభవం సంతరించుకోనుంది.

జేకేసీ కళాశాలలో ఫుడ్ కోర్ట్



ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్

పసందుగా వంటకాలు

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని జేకేసీ కళాశాలలో బుధవారం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేశారు విద్యార్థినీ విద్యార్థుల ఆధ్వర్యంలో తయారుచేసిన పసందైన వంటకాలు ఆహార ప్రియుల్ని ఆకట్టుకున్నాయి. వివిధ రకాల కూరలు, బిర్యాని, రైస్ ఐటమ్స్, చికెన్, కూరగాయలతో చేసిన ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. మొత్తం 150 పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫుడ్ కోర్టును కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ప్రారంభించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ కే సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకురాలు నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్ట్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ

● 31లోగా చెల్లించాలి ● కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

వినుకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో పాతబకాయిలు చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం తగ్గింపు ఉంటుందని, కావున ఈ నెల 31వ తేదీలోపు పట్టణ ప్రజలు పన్నులు చెల్లించాలన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో కూడా మునిసిపల్ కార్యాలయంలో పన్నులు కట్టించుకునేందుకు ప్రత్యేకంగా కౌంటర్ ఏ ర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలపాడు ఉపసర్పంచ్ ఎన్నిక నిలిపివేత

నరసరావుపేట రూరల్, మార్చి 26, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని పాలపాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికను నిలుపుదల చేసినట్లు పల్నాడు జిల్లా డీజీపీవో బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగో వార్డు సభ్యుడు చనిపోయిన విషయం ఆలస్యంగా తెలిసినందున సదరు ఎన్నిక వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

నేడు కొండాయిపాలెం ఉప సర్పంచ్ ఎన్నిక

ఈపూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయిపాలెం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ఎన్.రత్నం తెలిపారు. ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయడం వలన ఎన్నిక జరుగుతుందన్నారు పంచాయతీలో 10 వార్డులు ఉన్నాయన్నారు.

జంగాలపల్లి...

నూజెండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగాలపల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక 27వ తేదీన జరగనున్నట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఎన్నికల నియమావళిని ఎన్నికల అధికారి గ్రామంలో తెలియజేస్తారన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు: ఏవో సరిత

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా కందుల కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సరిత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఈ కొనుగోళ్లు చేస్తున్నట్లు చెప్పారు. కందులతోపాటు శనగలు కూడా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కందులు క్వింటాకు రూ.7,550లు, శనగలు రూ.5,650లు మద్దతు ధరగా ప్రకటించారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా బహిరంగ మార్కెట్‌లో తక్కువ ఉంటే రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు మద్దతు ధరలకు కొనుగోలు చేస్తారన్నారు. రైతులందరూ గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదవోలు మండల పరిషత్ ప్రాథమిక బీసీ పాఠశాలకు చెందిన విద్యార్థి నవోదయ విద్యాలయంలో సీటు సాధించాడు. గ్రామానికి చెందిన దావల ప్రదీప్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సీటు సాధించిన ప్రదీప్‌ను ఎంఈవో నాగరత్నం బుధవారం అభినందించి స్టేషనరీ సామగ్రిని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కొండెపాగ అకిరానందన్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించాడు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆలోకం మారుతీరావు, ఎంఈవో కృష్ణారెడ్డి తదితరులు అభినందించారు.

31లోపు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : ఏవో

వినుకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పుకొండలో మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఉద్యాన విస్తరణ అధికారి నారాయణ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు పండించే పంటను తప్పనిసరిగా సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగుల అన్నదానం

వినుకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం భవనంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యడవల్లి వెంకటసుబ్బయ్య శర్మ 80వ సంవత్సరం జన్మదినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు.

ఘన వ్యర్థాలపై శిక్షణ

రొంపిచర్ల, మార్చి 26 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల ఘన వ్యర్థ పదార్థాల షెడ్డు వద్ద మూడవ రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. నరసరావుపేట మండలం ఒకటవ బ్యాచ్‌కి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసరావుపేట ఎంపీడీవో కృష్ణకుమారి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన చెత్తను తడి, పొడిచెత్తగా వేరుచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

అనర్హుల తొలగింపు ఎప్పటికో...?



తనిఖీ చేస్తున్న ఆరోగ్య బృందాలు (ఫైల్‌ఫొటో)

● అర్హులకన్నా అధికం
● తనిఖీలు పూర్తయి రెండు నెలలు
● కొనసా..గుతున్న పింఛన్‌ల ప్రక్షాళన

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచానికి లేదా చక్రాల కుర్చీకి పరిమితమైన వారికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.15వేలు పింఛన్ చెల్లిస్తోంది. ఈ ఆరోగ్య పింఛన్‌లను పక్షవాతం లేదా కండరాల బలహీనతలతో నడవలేకుండా ఇతరులపై ఆధారపడి జీవించే వారికోసం ఉద్దేశించింది. అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ పింఛన్లు దుర్వినియోగం అయ్యాయని, అనర్హులు సైతం పింఛన్‌లు పొందుతున్నారని ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో తనిఖీలు నిపుణులైన వైద్య బృందాలను గ్రామాలకు పంపించి తనిఖీలు చేయించింది. రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం అనర్హుల జాబితాలను బయట పెట్టలేదు. దీనితో తనిఖీలు పూర్తయినా అనర్హులను తొలగించకపోవడంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూడా అనర్హులకు పింఛన్ల పంపిణీ జరిగింది.

జిల్లాలో..

జిల్లా వ్యాప్తంగా 34 మండలాల పరిధిలో 35,367 వికలాంగ పింఛన్లు, 1,035 డీఎం అండ్‌హెచ్‌వో (ఆరోగ్య పింఛన్‌లు) సిఫారసు పింఛన్‌లు ఉన్నాయి. శారీరక వైకల్యంతో పాటు, వినికిడి, చూపు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి వికలాంగుల పింఛన్ కింద నెలకు రూ.6వేలు, ఆరోగ్య పింఛన్ల కింద పక్షవాతం, కండరాల బలహీనతతో బాధపడుతున్న వారికి నెలకు రూ.15వేలు అందజేస్తున్నారు. అయితే వీరిలో చాలామంది తమకున్న పరిచయాలు, పలుకుబడితో సదరం సర్టిఫికెట్‌లను పొంది పింఛన్‌లను పొందుతున్నారు. పల్నాడు జిల్లాలో మంజూరైన ఆరోగ్య పింఛన్లలో పక్షవాతం బారిన పడ్డారంటూ 654 మందికి, తీవ్ర కండరాల బలహీనతతో 381మంది మంచానికి లేదా చక్రాల బండికి పరిమితమయ్యారంటూ డీఎంఅండ్‌హెచ్‌వో సిఫారసులతో ప్రతి నెలా రూ.15వేలు పొందుతున్నారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు మండలంలో ఆరోగ్య పింఛన్లు తీసుకుంటున్నవారు 31 మంది ఉండగా వారిలో 60శాతం మంది అనర్హులు కావడం విశేషం. యడ్లపాడులో ఐదుగురు ఆరోగ్య పింఛన్లు పొందుతుండగా వారిలో ఒక్కరు మాత్రమే మంచానికి పరిమితమవ్వగా మిగిలిన వారంతా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నవారే. ఉన్నవ గ్రామంలో 9 ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారు ఉండగా వారిలో ముగ్గురు మాత్రమే అర్హులు ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య పింఛన్ల మంజూరులో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడితో చోటా మోటా నాయకులు తమ వారికి ఆరోగ్య పింఛన్లను మంజూరు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు సైతం అనర్హులు పింఛన్లు పొందుతున్నారన్న విషయాలను బయటకు చెప్పేందుకు సాహసం చేయలేదు. అధికారులు ఎవరైనా మీకు ఎలాంటి ఆరోగ్య సమస్య లేదుకదా బాగానే ఉన్నారు కదా మీకెలా పింఛన్ మంజూరయ్యిందని అడిగితే వారిని బెదిరించి నోరు మూయించిన సంఘటనలు కోకొల్లలు.

పర్యవేక్షణ లేకనే

స్వల్పంగా పక్షవాతం వచ్చి సత్వరమే చికిత్స పొంది కోలుకున్న వారికి, రాజకీయ పలుకుబడి కలిగిన నాయకుల సిఫార్సులకు తలొగ్గి ఈ పింఛన్లను మంజూరు చేశారు. కొద్ది మంది వ్యాధిసోకిన కొన్నాళ్ళు మంచానికి పరిమితమై అనంతరం కోలుకున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడడం, ఉదాసీన వైఖరి కారణంగా ప్రతి నెలా పింఛన్‌ను పొందుతూనే ఉన్నారు. ఎంతో కాలంగా అర్హత కలిగి ఉండి పింఛన్‌లు రాక ఇబ్బందులు పడుతున్న వారికి వారి స్థానంలో అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువు, ఎత్తిపోతల పథకాల్లో ప్రత్తిపాటి పరిశీలన



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని తాగు నీటి చెరువును, చెరువుకు నీటి సరఫరాకోసం కుప్పగంజి వాగుపై రూ.25 లక్షలతో మరమ్మతులు చేసిన ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ తాగునీటి సరఫరా, చెరువులు, ఎత్తిపోత పథకాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించనన్నారు. ఈ ఎత్తిపోత పథకం ద్వారా చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్ల, కావూరు, పురుషోత్తమపట్నం గ్రామాలకు తాగునీరు, 2,586ఎకరాలకు సాగునీరు అందుతుందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. సొంత నిధులతో పథకం మరమ్మతు పనులు చేయించిన నీటిసంఘం అధ్యక్షుడు బైరా సంజీవరావును, ఆయనకు సహకరించిన లింగంగుంట్ల గ్రామ టీడీపీ నాయకులు తుబాటి కిశోర్, పెడవలి చంద్రశేఖర్‌ను, గ్రామ రైతులను ఆయన అభినందించారు. సమస్యను గుర్తించి లిఫ్ట్ పునరుద్ధరణలో గ్రామస్థులంతా ఒకే మాటపై ఉండి పనిచేయడం అభినందనీయం అన్నారు. చెరువులోని పూడికను వేసవిలోనే తొలగించాలని, ఎలాంటి నాచు, తూటికాడ సహా, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని, చెరువుగట్టుపై మొక్కలు పెంచాలని ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, తుబాటి కిషోర్, జనసేన నాయకులు తోట రాజా రమేష్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

నాదెండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తూబాడులోని ముస్లిం కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల విడుదలలో ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. పనుల్లో లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయనతో పాటు జనసేన సమన్వయకర్త రాజారమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జే.మదన్, దగ్గుమల్లి సాంబశివరావు, దగ్గుమల్లి వెంకటేశ్వర్లు, షేక్ యాసిన్, గోపాళం నాగేశ్వరరావు, ఖాజావలి, డీ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



తూబాడులో సిమెంట్ రోడ్డు, డ్రెయినేజ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

ఫిజికల్ సైన్స్ పరీక్షకు 99.01 శాతం విద్యార్థుల హాజరు

● డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్. మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 99.01 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈవో ఎల్ చంద్రకళ బుధవారం తెలిపారు. జిల్లా మొత్తంలో 128 పరీక్షా కేంద్రాలలో రెగ్యులర్ విద్యార్థులు 25, 488 మంది విద్యార్థులకు 25,237 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రైవేట్ విద్యార్థులు 339 మంది హాజరయ్యారని చెప్పారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 22 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి పరీక్షలు మార్చి 2025న జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ పరిక్షకు 27 సెంటర్‌లలో 1150 మంది విద్యార్థులకు 958 మంది విద్యార్థులు 83 శాతం హాజరయ్యారు.

పారిశుధ్యంపై అందరూ సహకరించాలి: ఎంపీడీవో

ఈపూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై అందరూ సహకరించాలని ఎంపీడీవో కే ప్రభాకర్ అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం వద్ద జరుగుతున్న ఈపూరు, బొల్లాపల్లి మండలాల పారిశుధ్య కార్మికుల శిక్షణ తరగతులలో ఎంపీడీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎన్ రత్నం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు జనరల్ బాడీ సమావేశం

బొల్లాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నేడు జనరల్ బాడీ సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో పీ సీతారామయ్య బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. సమావేశం ఉదయం 11 గంటలకు మొదలవుతుందని, మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

రుణమేళాకు 59మంది హాజరు

నాదెండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రుణమేళా నిర్వహించారు. కాపు, ఈబీసీ, బీసీ తదితర వర్గాల వారికి ఈ రుణ మేళాను నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 310 మంది దరఖాస్తు చేసుకోగా 59 మంది మాత్రమే హాజరయ్యారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల నుంచి ఐదు లక్షల వరకు వివిధ యూనిట్లకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించనుంది. యూనిట్ విలువలో 50శాతం సబ్సిడీ ఉంటుందని ఎంపీడీవో స్వరూపరాణి తెలిపారు. బ్యాంకు ప్రతినిధు, ఈవోపీఆర్‌డీ నిర్మల లక్ష్మీకుమారి తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.



డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ఆందోళ చేస్తున్న ఏపీ రైతు సంఘం, సామాజిక వన రైతు సంఘం నాయకులు

జామాయిల్ వేలంలో అవకతవకలు అరికట్టాలి

● ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ జామాయిల్ వేలంలో అవకతవకలు, కర్ర అక్రమ రవాణాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా అటవీశాఖ డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అటవీ భూములలో జామాయిల్ పెంచడానికి వీలులేదన్నారు. అయినా జామాయిల్ కర్ర పెంచుతున్నారన్నారు. బయట మార్కెట్‌లో టన్ను జామాయిల్ కర్ర రూ.7500లు ఉన్నప్పటికి వ్యాపారులు రూ.9300లు ఏరకంగా అటవీశాఖ నిర్వహించిన వేలం పాడుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో 50వేల టన్నుల కర్ర నరకడానికి వేలం పెడితే, వీళ్ళు యథేచ్ఛగా అదుపులేకుండా పరిమితికి మించి కర్ర కొట్టి దానిని అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం డీఎఫ్‌వో జీ కృష్ణప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక వన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి, సామాజిక వన రైతుల సంఘం నాయకులు కే వీరారెడ్డి, కొల్లి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, ఎస్‌కే హుస్సేన్, కాసా రాంబాబు, టీవీ శేషయ్య, లక్షాధికారి, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, బి.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సభ్యులకు అవగాహన

చిలకలూరిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొమరవల్లిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో, వ్యవసాయ సహకార సంఘాల సభ్యులకు కంప్యూటరీకరణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా సంఘ అఫిషియల్ పర్సన్ ఇన్చార్జి పై మహేష్ కుమార్, జీడీసీసీ బ్యాంకు చిలకలూరిపేట బ్రాంచి మేనేజర్ గొడ్డేటి శ్రీనివాసరావు, సంఘ సీఈవో బండ్ల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

దౌర్జన్యంతో గెలవాలని చూస్తున్నారు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నర్సరావుపేట రూరల్, మార్చి 26, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రొంపిచర్ల మండలాల్లో ఖాళీ అయిన స్థానాలకు వైస్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ వారికి మెజార్టీ లేకపోయినా దౌర్జన్యంతో గెలవాలని చూస్తున్నారని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ఆరోపించారు. ఈ నేపథ్యంలో నరసరావుపేట, రొంపిచర్ల మండలాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పూర్తి బాధ్యత అధికార పార్టీ ఎమ్మెల్యేదే అని హెచ్చరించారు.

నేడు క్రెడిట్ క్యాంపు

ఈపూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిలో బాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద రుణ అర్హత మేళ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే ప్రభాకర్ చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపికలో పాల్గొనాలన్నారు.

ఇంటర్వ్యూలకు 65మంది హాజరు

శావల్యాపురం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్‌ల ద్వారా చంద్రన్న స్వయం ఉపాధి రుణాలకు దరకాస్తులు చేసుకొన్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 7 సచివాలయాల నుంచి 190మంది అభ్యర్థులు రుణాల కోసం దరకాస్తులు చేసుకోగా వారిలో 65మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. ఎస్‌బీఐ మేనేజర్లు వలేటి ప్రసాద్, భార్గవ్, సీజీజీబీ మేనేజర్ శివకృష్ణ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. శావల్యాపురం మండలంలో 28మంది లబ్ధిదారులకు స్వయంఉపాధి రుణాలు మంజూరు చేయనున్నారు. వారిలో 16 బీసీలకు, 8 ఈబీసీలకు, 4 కాపులకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల అర్హతలను పరిశీలించి వారిలో 28మందిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణ, జూనియర్ అసిస్టెంట్ భారతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. సుమారు 30మందికి రూ.24.40 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటివరకు 11626మందికి రూ.157కోట్లుకు మించి చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు వివిధ మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు శివశక్తి ఫౌండేషన్ చేయూత

వినుకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వ వార్డు వెన్నపూస కాలనీలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సౌజన్యంతో సాయం అందజేశారు. బాధితులు తిరుమల శ్రీను, తిరుమల రమణయ్య, తిరుమల గోవిందయ్యలకు స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు బుధవారం ఆర్థికసాయం, వంట సామగ్రి, దుస్తులు, నిత్యవసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ రమేష్, పి.వి.సురేష్, మురళీకృష్ణ, వడితే శ్రీనునాయక్, చిన్న, ఖాశీం, గంధం సుబ్బారావు, తిరుమల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే అరవిందబాబు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణం టీడీపీ నియోజకవర్గ కార్యాయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణం నాలుగో వార్డు చేపల మార్కెట్ వద్ద మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరై పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

జేఎన్‌టీయూ కళాశాల వైస్ చాన్సలర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట జేఎన్‌టీయూ కళాశాలలో జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కలిశారు. కళాశాల సమస్యలపై ఆయనతో చర్చించారు.

ప్రజా సమస్యలపై స్పందించని అధికారులపై చర్యలు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించటంలో స్పందించని అధికారులపై చర్యలు తీసుకుంటానని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జీవీ, అధికారులతో కలిసి బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రంలో వినుకొండను ఆదర్శంగా నిలపాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి అధికారులతో సమ్యలపై చర్చించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జీవీ కార్యాలయంలో సమస్యలపై ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఉన్న తృప్తి, అనుభూతి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.



పట్టణంలో రాస్తారోకో చేస్తున్న సాయిసాధన చిట్‌ఫండ్ భాదితులు, డిపాజిటర్లు

సాయి సాధన చిట్‌ఫండ్ బాధితుల రాస్తారోకో

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సాయి సాధన చిట్ ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని బాధితులు బుధవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. రాస్తారోకో సందర్భంగా కొంతసేపు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయ ఏర్పడింది. చిట్‌ఫండ్ సభ్యులను, డిపాజిటర్లను మోసం చేసిన పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యామిని రామారావు, చెకూరి సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ గట్టు సత్యనారాయణ, సభ్యులు, డిపాజిటర్లు పాల్గొన్నారు.



సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట రోటరీ క్లబ్ 100 సైకిళ్ల వితరణ

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ బుధవారం జరిగింది. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ సీఎస్‌ఆర్ ఫండ్స్ కింది 100మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, డాక్టర్ చిలుకూరి శరత్‌బాబు, డాక్టర్ ఏవీ రామలింగారెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కపిలవాయి రాజేంద్రప్రసాద్‌లు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడి సుబ్బారావు, సెక్రటరీ శివకుమార్, ట్రెజరర్ కట్టమూరి ఆంజనేయులు, కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, పాశం కృష్ణారావు, పోటు అచ్యుతరావు, కేవీ ఆంజనేయులు, జిలానీ మాలిక్, సుమిత్రకుమార్, ఎంవీ ఆంజనేయులు, పీ శివనాగరాజు, రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్ కాట్ల రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.